# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-09-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రప్రభుత్వం సహకారం అందిస్తుందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు.**
2. **బుడమేరుకు మరమ్మత్తులతో పాటు ఆధునికీకరణకు చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **కేంద్రమత్స్య, పశుసంవర్ధక, శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో పర్యటిస్తారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితులకు ఈ రోజు నుంచి నిత్యావసరాల కిట్లు పంపిణీ చేయనున్నట్టు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**
5. **సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచ గమనాన్ని మారుస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు.**

==========================

భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహకారం అందిస్తుందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర మంత్రి నిన్న పర్యటించారు. భారీ వర్షాలు, వరదలకు జరిగిన నష్టంపై నిన్న విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి కేంద్ర మంత్రి తిలకించారు. జరిగిన నష్టాన్ని చంద్రబాబు నాయుడు ఆయనకు వివరించారు. కేంద్రసాయం కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రితో కలిసి కేంద్రమంత్రి నిన్నపాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ ప్రాథమిక అంచనాల ప్రకారం 1.8 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతిందని, 2 లక్షల మంది రైతులు నష్టపోయారని తెలిపారు. జరిగిన నష్టంపై నిపుణుల బృందాలు అధ్యయనం చేస్తున్నాయని, అది పూర్తవగానే కేంద్రం నుంచి సహాయం అందిస్తామని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

వాయిస్ ( 35 సెకన్లు)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, బుడమేరుకు పలుచోట్ల గండ్లు పడడంతో ముంపు పరిస్థితులు తలెత్తాయని అన్నారు. ప్రకాశం బ్యారేజీ సామర్థ్యాన్ని 15 లక్షల క్యూసెక్కులకు పెంచేందుకు ఒక

సాంకేతిక బృందంతో అధ్యయనం చేయిస్తున్నామని, అలాగే బుడమేరుకు మరమ్మత్తులతో పాటు ఆధునికీకరణకు చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి తెలుపుతూ..

వాయిస్ (25 సెకన్లు)

కాగా ఈ రోజు తెలంగాణలోని వరద ప్రభావిత ఖమ్మం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయనున్నారు.

---------------------------

వరద నీరు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. వరద ప్రాంతాల్లోని పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, వరద ముంపు ప్రాంతాల్లో క్లోరినేషన్ చేపట్టాలని అంటు వ్యాధులు, దోమల తీవ్రత ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని చెప్పారు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఈ పనులపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని పవన్ కళ్యాణ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---------------------------

కేంద్రమత్స్య, పశుసంవర్ధక, శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో పర్యటిస్తారు. మత్స్య సంపదను ప్రోత్సహించడంలో భాగంగా రొయ్యల పెంపకం, ఎగుమతులపై ఈరోజు విశాఖపట్నంలో జరగనున్న కార్యక్రమానికి మంత్రి అధ్యక్షత వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్, రాష్ట్ర మంత్రులతో పాటు ఇతర అధికారులు పాల్గొననున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితులకు ఈ రోజు నుంచి నిత్యావసరాల కిట్లు పంపిణీ చేయనున్నట్టు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అమరావతిలో మంత్రి నిన్న మాట్లాడుతూ, మొదటి రోజు 50వేల కుటుంబాలకు కిట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కిట్లలో 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ పంచదార, రెండు కేజీల ఉల్లిపాయలు, రెండు కేజీల బంగాళదుంపలు, లీటరు వంటనూనెను బాధితులకు అందజేయనున్నట్టు చెప్పారు. 2 లక్షల కుటుంబాలకు నిత్యావసరాల కిట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని, ఈ-పోస్ మిషన్ ద్వారా సరకుల పంపిణీ జరుగుతుందన్నారు. రేషన్ కార్డులు లేని వారికి ఆధార్ కార్డు ద్వారా లేదా బయోమెట్రిక్ ఆధారంగా పంపిణీ చేస్తామని మంత్రి వెల్లడించారు.

---------------------------

సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచ గమనాన్ని మారుస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ ఐటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సులో నిన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నేటి తరం అద్భుత ఆవిష్కరణ కృత్రిమ మేధ-ఏఐ అని కొనియాడారు. కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాయన్నారు. హైదరాబాద్‌లో ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేశామని, నాస్కామ్ సహకారంతో ఏఐ వ్యవస్థకు రూపకల్పన జరుగుతుందన్నారు. నూతన ఆవిష్కరణలకు పారిశ్రామిక నిపుణులతో తెలంగాణ ప్రభుత్వం కలిసి పనిచేస్తోందని, అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దాం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

--------------------------

భారీ వరదల నేపథ్యంలో విజయవాడలోని ముంపు పరిస్థితులు, నష్టాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదించి చర్యలు తీసుకుంటామని కేంద్ర హోంశాఖ అదనపు కార్యదర్శి సంజీవ్ కుమార్ జిందాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు, వరదలతో ప్రభావితమైన కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను సంజీవ్ కుమార్ జిందాల్ బృందం పరిశీలించి,. వరద ముంపు ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేసింది. అనంతరం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సంజీవ్ కుమార్ జిందాల్ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో భారీ వర్షాలు, వరద వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించామన్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద గేట్లను పరిశీలించామని తెలుపుతూ..

వాయిస్ ( 30 సెకన్లు)

--------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా సెప్టెంబర్ నెలను పోషకాహార మాసంగా నిర్వహిస్తోంది. "జాతీయ పోషకాహార మిషన్ " అని కూడా పిలిచే ఈ కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2018 మార్చి 18వ తేదీన ప్రారంభించారు. పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించి వారిని ఆరోగ్య వంతులుగా తీర్చి దిద్దడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఇందు కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించాలన్న ఉద్దేశ్యంతో సెప్టెంబర్ నెలను పోహకాహార మాసంగా నిర్వహించి బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పోషకాహార లోపాన్ని నివారించడానికి జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలంతా విస్తృత స్థాయిలో పాల్గొనాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో పిలుపునిచ్చారు. కాగా పోషణ అవగాహన మాసం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 లకు ప్రసారమవుతుంది.

--------------------------

భారీ వర్షాలకు తెగిపోయిన చెరువు కట్టలు, కాల్వలకు మరమ్మత్తులను చేపడుతున్నామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో వర్షాలతో తలెత్తిన పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలు, వర్ష సూచన నేపథ్యంలో ముందు జాగ్రత్తలపై మంత్రి దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, మరమ్మత్తుల కోసం పాలనాపరమైన అనుమతులు తీసుకొని ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

--------------------------

తెలంగాణలో ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. నిన్న హైదరాబాద్ పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ 26న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకొని మార్పులు, చేర్పులు చేసి జనవరి 6న తుది జాబితాను విడుదల చేస్తామని వెల్లడించారు.

=====================